


సంపుటము ౯] రాజమహేంద్రవరము : శా. శ. ౧౮౬౧ శ్రావణం ౧౦ ఆగష్టు ౧౯౩౯ [౫ సంచిక

1939

వ్యాఖ్యానములు

ఆంధ్రమహాసభా—కాంగ్రెస్సేతరులూనూ

ఈవిషయమై, బ్రహ్మశ్రీ గుమ్మిడిదల వేంకటసుబ్బారావు గారికి ప్రబుద్ధాంధ్ర ధోరణి నచ్చలేదు.

వివరించి చెప్పగా తమ భావాన్నే స్థిరపరుచుకున్నారు వారు.

అంచేత, మళ్ళీ వొక పెద్ద లేఖ రాశారు.

ధోరణి వెనకటిదే; కాని కొంచెం అటూ యిటూ వెళ్ళింది.

ఉద్రేకం కొంచెముగా తగ్గినట్లు అయింది.

ఇంతే భేదం.

కాని ఇప్పట్లో ఆంధ్రోద్యమ నేతలను అది వుండవలసే వుంది.

చాలా సంతోషం.

అయితే, సుబ్బారావు గారి యీ ఆంధ్రమహాసభా వ్యామోహాం మేం యేవిధంగానూ సమర్థించలేము.

వారి రాతలన్నూ అపని చెయ్యలేక పోతున్నాయి.

కాని, "యీకాలే ఆంధ్రోద్యమనేత లెవరూ" అని పరిశీలిస్తే, మాదృష్టిలో, వొక్క— గుమ్మిడిదల వెంకటసుబ్బారావుగారూ, వొక్క— పంద్రంగి కేశవరావుగారూ మాత్రమే వున్నారు.

అయినప్పటికీ కాంగ్రెస్సంటే యేమాత్రమో భక్తీ, కాంగ్రెస్సాంధ్రులతో యేమాత్రమో సామాచర్యాలా కనపడుతూ వుంటే, ఆంధ్రోద్యమం మళ్ళీ వొక మారు విజృంభించి సాఫల్యం పొందు ందనీ, ఆంధ్రరాష్ట్రం నిర్మించబడి జాతి బాగుపడుతుం దనీ ఆశించడం యెలాగా?

అయితే, ఆంధ్రరాష్ట్రం రమ్మనక మానదు.

ఇది సర్వాత్మనా నిశ్చయం.

"ఎప్పుడూ?" అంటే మాత్రం, తెనుగుదేశంలో కాంగ్రెస్సు నామమాత్రం అయిపోయినప్పుడే.

"ఇదెప్పుడు సంభవిస్తుంది?" అంటే మన తెనుగువారు గుజ రాతీమిల్లు బట్టలను పూర్తిగా బహిష్కరించగలిగినప్పుడే.

వేంకటసుబ్బారావు కేశవరావుగార్ల నాయకత్వం సఫలం అవుతుం దనే మేము నమ్ముతున్నాము.

సఫలం కావా లనే మేము కోరుతున్నాము.

కాని వారు ముందు వ్యాసయం ఖాళీతం చేసేసుకోవాలి.

మరి తప్పదు.

వేంకటసుబ్బారావు గారు ప్రబుద్ధాంధ్రకు రాసిన లేఖ "కాని మళ్ళీ చెబుతున్నా—కాంగ్రెస్సేతరు లైనా, మహాసభలో చేరాలి. మహాసభలో కాక పోతే ఆంధ్రమహారాజశ్రీలు అల్పసభలో చేర తారా? మహాసభని స్వాధీనపరుచుకోవాలి. ఆంధ్రరాష్ట్రస్థాపన చేయించాలి. వేరే గత్యంతరం లేదంటాను" అనే మాటలతో ముగిసివుండగా, వారే (౨౯-౭-౩౯) జనవాణికి రాసిన లేఖ "కాని యేకారణంచేత నైనా వారు (కాంగ్రెస్సాంధ్రులు) అట్లా చెయ్యక, యిదివరకు వలెనే పాక్షికదృష్టితోనే వ్యవహరిస్తే, రేపటి మహాసభనుంచి అయినా, కాంగ్రెస్సేతరు లంతా వొక మాటగా వ్యవహరించి, మన రాష్ట్రస్థాపనపట్ల యీ కాంగ్రెస్సు వారి కుతంత్రములను, కుట్రలను, కుటిలములను, అంతరింపజేయవలసి వస్తుంటుంది" అనే మాటలతో పూర్తి అయింది.

కనక, వేంకటసుబ్బారావు గారికి, పతితురాలికంటే అధమ స్థితిలో వున్న ఆంధ్రమహాసభమీది వ్యామోహం తర్వలోనే తొలగిపోతుం దని నమ్ముతున్నాము.

ఏమంటే ?

వేంకటసుబ్బారావుగారు, జనవాణి లేఖలో "ఆందోళన చేసే కొద్దిమంది కాంగ్రెస్సేతరుల నైనా అస్పృశ్యులుగా చూస్తున్నారా లేదా యీ ఆంధ్రకాంగ్రెస్సు పెద్దలు ?" అన్నారు.

ఇప్పుడిలా అన్న సుబ్బారావుగారు జులైనెల (౧౦వ తేదీ) ప్రబుద్ధాంధ్ర లేఖలో "కాంగ్రెస్సేతరులు తాము తక్కువ కులం వాళ్ళ మనుకోగూడదు. మహాసభకు హాజ రైతే మాలవాళ్ళను చూసినట్టు చూస్తా రేమో ననుకోగూడదు. తమ భయం వదలాలి-మహాసభకు హాజరు కావాలి—తమ హక్కులు చెలాయించుకోవాలి" అని వున్నారు.

ఎంత వారా !

ఎంత స్ఫుట మైన మార్పూ ?

ఇదిలా వుండగా :

నరసారావుపేట డివిజనులో మద్రాసు అసెంబ్లీకి వైయెలక్షను సంభవించింది.

అసెంబ్లీ సభ్యుల సంఖ్య చూసినా ఈయెలక్షను గొడవ నిర్లక్ష్యం చెయ్య తగే వుంది.

అసెంబ్లీలో కాంగ్రెస్సుపక్షానికి శంక పడుతూ వున్న మెజారిటి చూసినా ఈయెలక్షను గొడవ గడ్డిపరక వంటిదే అయి వుంది.

నిజంగా యిది అసభ్యత్వం ఆశించే వ్యక్తులు చూసుకోవలసిందే కాని తక్కినవా రంతా కలగచేసుకోవలసింది కానేకాదు.

కాని కాంగ్రెస్సువారు, వొక చీట్టెలకని పట్టడానికి వొక పెద్దకొండ తవ్వసాగారు.

కాంగ్రెస్సాంధ్రప్రముఖు లంతా అక్కడ దిగారు.

కాంగ్రెస్సు (చెల్లని) అధ్యక్షులవారి దగ్గిరనుంచి సందేశం తెప్పించుకున్నారు.

పార్లమెంటరీసెక్రటరీలు దిగారు.

చివరికి మంత్రులుగూడా "తెరవెళలారు"

ఇంతమాత్రమేనా ?

దీంతో ఆగి వుంటే, అది, స్థానిక విప్రభావం అని పూరుకోడానికి వీలయి వుండును.

కాని, యీ "సముద్రంలో కాకిరెట్ట" కోసం కాంగ్రెస్సాంధ్రులు రెండుకోట్ల అర వై నాలుగు లక్షల తెనుగువారికి జవాబు చెప్పవలసిన ఆంధ్రమహాసభను విసిరిపారేశారు.

తత్వం తెలుసుకోకుండా—తమ నిరసనభావాన్ని కూడా పరిగణించకుండా పనిచేస్తూ వున్న మిత్రులు తంగిరాల రాధాకృష్ణయ్యగారివంటి యువకు లున్నారుగదా, వారు ఎన్నికలలో కలగచేసుకోవలసిన పని వున్నవారు కారు గదా, తాత్కాలికంగా ఏర్పాట్లన్నీ వారికి స్వాధీనపరిచి యీ కాంగ్రెస్సాంధ్రులు, ఎన్నికల తరవాత మళ్లీ పూనుకోగూడదూ ?

ఇలా అయితే యెన్నికల పనీ గడునునే ?

ఆంధ్రమహాసభకి వాయిదా వెయ్యవలసిన అవసరమూ లేకపోవునే !

ఏం, వా రిలా యెందుకు చేశారు గనకా ?

వేంకటసుబ్బారావుగారి గుర్తించారా ?

కాంగ్రెస్సాంధ్రుల ప్రవృత్తి యిప్పటి కయినా వారు తెన్నుగా తెలుసుకోగలిగారా !

అలాంటి ఆంధ్రమహాసభకోసం కాంగ్రెస్సేతరులు పాకులాడ్డం అనుచితం అని వా రింకా గ్రహించలేరూ !

వేంకటసుబ్బారావుగారిని చెయ్యిపట్టుకుని మానిశ్చితమార్గంలో ప్రవర్తింపచెయ్యగల మని మాకు ధైర్యం లేదు.

త్యాగమూర్తు లైన వారియెడల అలాంటి ప్రయత్నం చేద్దామన్నా మాకు తాహతూ లేదు.

కనక, వారికి వొక్క సంగతి నివేదించుకుంటాము.

ఈసంచికలో వున్న తమ లేఖలో, వారు, "కాని ఆంధ్రదేశంలో కాంగ్రెస్సువారి సంఖ్య 3 లక్షలు—కాంగ్రెస్సేతరులు రెండుకోట్ల పైచిల్లర" అన్నారు.

ఇంతమంది కాంగ్రెస్సేతరులను కాంగ్రెస్సాంధ్రులు ఏమి చెయ్యగల రని వారి భావం.

బాగానే వుంది ?

కాని, యీరెండుకోట్ల పైచిల్లర ఆంధ్రులూ యెలాంటివారూ ?

పిల్లలు. ముసలివాళ్లు. ముసలిపక్షులు. అంతర్వేది అవతల వూళ్లు లేవనుకునే అజ్ఞానులు. అన్యాంధ్రదేశాలలోనూ, ఖండాంతరాలలోనూ వున్నవారు. రక్తసంబంధం వుండినా రాజకీయంగా భిన్నులయిపోయినవారు. అరవదేశం మధ్యభాగంలో స్థిరపడిపోయినవాళ్లు, మైసూరు రాజ్యంలో కన్నడు లయిపోతున్నవారు.

కనక వారి సంఖ్య, వూరకం మాత్రమే.

ఇక 3 లక్షల కాంగ్రెస్సాంధ్రుల మాట.

వారిలో చాలామంది "నభూతో నభవిష్యతి" గాళ్లు

కొందరు మారు పేర్ల వారు.

కొందరు కాంగ్రెస్సనే పేరే యెరగని వారు.

కొందరు కాంగ్రెస్సుకి దూరంగా వున్నవారు.

చాలామంది సొంతంగా చావలా యివ్వనివారు.

అయినా—వీరందర్నీ తీసేసినా కాంగ్రెస్సాంధ్రుల సంఖ్య యెక్కొద్దిగానో తగ్గుతుం దనీ—అప్పటికీ నికర మైన సంఖ్య పెద్దదిగానే వుంటుం దనీ వొప్పుకుంటాము.

ఇక చెప్పవచ్చిందల్లా యేమి టంటే !

తెనుగు మండలాలలో—తెనుగువారిలో ప్రజాభ్యుదయం కోసం రాజకీయాలలో ప్రవేశించినవారు వారే.

ఏవుద్యమంలో నైనా చేరతగ్గవారూ. చేరేవారూ ప్రస్తుతం వారు మాత్రమే.

కాని వారంతా దగాపడిపోయి—చెప్పేవారు లేక గుజరాతీల కాంగ్రెస్సులో యిరుక్కుపోయారు.

బొంబాయి అహమ్మదాబాదు బట్టలమిల్లుల అభివృద్ధికోసం తమ సర్వస్వమూ వొదులుకుని కేస్యాసు చెయ్యవలసిన ఏజంట్లయి పోయారు.

మరి ఆంధ్రమహాసభ కైనా మరో సభ కైనా రావాలంటే మనుష్యు లేరీ ?

కనకనే తెనుగుదేశపు సరిహద్దులలోనుంచి మేము కాంగ్రెస్సుని సాగనంపా లనడం.

నిజం చెబితే—జరుగుతున్న దగా విప్పి బోధిస్తే—పన్నబడ్డ వుచ్చులు చూపిస్తే వారంతా గంటలో కాంగ్రెస్సుని తన్నేసి వచ్చేస్తారు.

కాగా, ఇప్పుడు ఆంధ్రమహాసభ కాదు ముఖ్యం.

ఆంధ్రరాష్ట్రప్రచారం కాదు ప్రధానం.

వేంకటసుబ్బారావుగారి వంటి నాయకు లిప్పుడు చెయ్యవలసింది, తెనుగు యువయువతుల మనస్సులనూ, శ్రద్ధాసక్తులనూ గుజరాతీల అభ్యుదయకాంక్షనుంచి ఆత్మాభ్యుదయకాంక్షమీదికి మళ్లించడం.

గుజరాతీల పాదాలాశ్రయించి అశుభమూ శుభమూ తెలియని యీ అమాయిక యువయువతుల మీద వినాయకత్వం చెలాయిస్తూ వున్నవారికి ఆంధ్రదీక్ష యివ్వడం సాధ్యం కాదు.

స్వార్థం వారికి సత్యాన్ని తెలవనివ్వదు.

యువయువతు లలాంటి స్థితిలో లేరు.

చెప్పే మొగాడుంటే వీరంతా కాంగ్రెస్సుని నట్టేట ముంచేసి చక్కావచ్చేస్తారు.

వేంకటసుబ్బారావుగారు ఇందుకు పూనుకోగూడదూ ?

వీరి కందరికీ ఆంధ్రదీక్ష యిస్తే యిక ఆంధ్రరాష్ట్రానికి ఆలస్యం అన్నమాటే మిటీ ?

ఇండియామంత్రి అలా జవాబు చెప్పడం యెలా వస్తుందీ ?

రాజగోపాలాచారిగారికి ప్రధానమంత్రిపదవి యెక్కడవుంటుందీ?

అప్పుడు ఈపట్టాభిగారూ, యీసాంబమూర్తిగారూ, యీ వేంకటప్పయ్యగారూ యెక్కడ వుంటారో యెవరు చెప్పగలరూ?

ఇంతపని చెయ్యగలిగేవాడికి ఆంధ్రమహాసభ అంటే యిక లెక్కేమిటి జమేమిటి ?

ఆమహాసభావుని శాఖలే మహాసభ అయిపోదూ ?

సుబ్బారావుగారి దృష్టి యీదారిలో వున్నట్టు కనపడదు.

వారు నాయకత్వం వహించవలసినవారే గాని వారిచిత్తం యింకా ప్రయత్నాలలో వూగిపోతోంది.

లేకపోతే జూలై ౧౦ వ తేదీ ప్రబుద్ధాంధ్రలో "అధ్యక్షుడు సరే. రాధాకృష్ణయ్యగారు, ఆహ్వానసంఘాధ్యక్షుడు వావిళ్ల, సభాప్రారంభకులు సరే, మత్తా—వీరంతా కాంగ్రెస్సేతరులే" అని ఆంధ్రమహాసభావిముఖులకూడ సవాల్ కొట్టి వుండి (౨౯-౭-౩౯) జనవాణిలో "అసలు అధ్యక్షుపదవికే కాంగ్రెస్ కుట్ర. ఆందోళన చంపే అధ్యక్షుడు కావలె నని కోరి తెచ్చుకొన్నారు సర్వేపల్లివారిని" అని వారు తమ్ముతామే ఎదురుకుని వుండురా ?

ఇక జస్టిస్, పీపిల్సుపార్టీల విషయం.

వేంకటసుబ్బారావుగారు ఆపక్షాలవారిమీదికి చాలా దురుసుగా వెళ్ళారు.

అగత్యం లేదు.

తెనుగుదేశంలో కాంగ్రెస్సుకి నామరూపాలు లేకుండా చెయ్యండి.

ఇక ఆపక్షాలకు అవకాశం ఏమిటి ?

ఆంధ్రరాష్ట్రంవిషయమై ఆపక్షాలవారికి గల అజ్ఞానం మేమూ యెరుగుదుము.

ప్రబుద్ధాంధ్ర వెనకటి సంచికలు విప్పిచూస్తే వారిమీదా విమర్శలు కనపడతాయి.

కాని గాంధిగారి కాంగ్రెస్సుని ౧౬ సంవత్సరాల కాలం జస్టిస్‌పక్షం తిప్పితిప్పి కొట్టింది.

ఇది సామాన్య మైనదా ?

దానియెడల విశ్వాసం చూపించడానికిది కారణం కాదూ ?

బొబ్బిలి నాయకత్వం లేకపోతే అది అలా అయిపోయేదేనా ?

ఇవాళ పీపిల్సుపక్షం కనపడ్డం లేదు.

మరి జనవాణి ?

అదే యివాళ పీపిల్సుపక్షానికి మహావిరాట్టు కాదూ ?

తత్సంపాదకులు, మిత్రులు, ధర్మారావునాయనింగారు కాంగ్రెస్సు అసెంబ్లీసభ్యులకంటే యెక్కువ దేశసేవ చెయ్యడం లేదూ ?

దేశీయులకు, కాంగ్రెస్సు చేస్తూ వున్న ద్రోహం బోధపడుతూ వైమనస్యం కలుగుతూ వుండంటే అది జనవాణి ప్రసాదం కాదూ?

ఒకమూల దీపం ఆర్పేస్తూనే వుంటే ఆంధ్రమహాసభకి దీపారాధన చేస్తున్నా రని వెంకటసుబ్బారావుగారు కాంగ్రెసాంధ్రులను పొగిడారే ?

జస్టిస్ పీపిల్సుపక్షాల యీ సేవ గుర్తించలేకపోవడం వారికి భావ్యంగా వుందా ?

ఇంతకీ: జస్టిస్సుపక్షం యిప్పుడు లేదు

కాంగ్రెస్సుపక్షం యింకా ద్రోహం చేస్తూనే వుంది.

ఆంధ్రరాష్ట్రం యెడల ఇండియామంత్రి విముఖుడు కావడానికి కాంగ్రెస్సు నియంతల మంతనాలు తప్ప మరే కారణమూ లేదు.

కాంగ్రెసేతరు లని తమచేత పొగడబడిన రాధాకృష్ణయ్యపంతులు గారు, తమ గాయత్రానికి ఇండియామంత్రి చెప్పిన జవాబు ప్రతి

నిధులకు నివేదించి వుండకపోవడం వేంకటసుబ్బారావుగారు గుర్తించారా ?

రాష్ట్రీయాభిమానాన్ని నిరసిస్తూ యీమధ్య గాంధీగారిచ్చిన స్టేటుమెంటు మొన్న మొన్న, ఆంధ్రరాష్ట్రాన్ని గురించి ఏ. ఐ. సి. సీ వారు బొంబాయిలో చేసిన తీర్మానాన్ని తుడిచి పారెయ్యడానికే అని వేంకటసుబ్బారావుగారిప్పటికయినా తెలుసుకున్నారా ?

ఈ స్టేటుమెంటు ఇండియా మంత్రికి ఎలాంటి భావం పుట్టిస్తుందో, దీనిమీద పట్టాభిగారు చేసిన వ్యాఖ్యానం ఆంధ్రులమీద ఎంత తీవ్రమైన మత్తుమందుగా పనిచేస్తుందో కూడా వారు గ్రహించుకున్నారా ?

చివరికి వేంకటసుబ్బారావుగారి కోక్కేటే మనవి.

ఆంధ్రమహాసభ ఏట్లో కలిసిపోనివ్వండి.

బెంగవద్దు.

కాంగ్రెస్సు బతుకంతా బట్టబయలు చెయ్యండి.

రాజగోపాలాచారిగారి ప్రభుత్వం మన కీవిషయంలో చాలా వుపకరిస్తోంది.

రాజగోపాలాచారిగారి యెత్తులకు వ్యాఖ్యానం చేస్తే చాలు, ఆంధ్రయువయువతులకు ఆంధ్రోద్యమం విషయమై వేరే ప్రచారం యేమీ చెయ్యనక్కరలేదు.

ఆంధ్రమహాసభకి మమ్మల్ని రమ్మనకండి.

మీరు కూడా ఆధరిమానాకి వెళ్లకండి.

బాగా ఆలోచించండి.

అస్పృశ్యుల దేవాలయ ప్రవేశం

మధురమీనాక్షమ్మ గుడిలో అస్పృశ్యులు ప్రవేశించారు.

తంజావూరిలో కూడా, బృహదీశ్వరాలయంలోనూ, మరో తొంభై గుళ్లలోనూ అస్పృశ్యులు అడుగు పెట్టారు.

భరతఖండం మొత్తంమీద వుండిన గొప్ప దేవాలయాలలో యీ మొదటివి రెండూ మొదటి శ్రేణిలోవి.

అంచేత, సనాతనుల పక్షంగా చూసినా, సంస్కర్తల పక్షంగా చూసినా యిది గుండెలు పూపేసే విషయం.

కాగా,

ఈ పునాదిమీద, వొక్కొక్కటే వొక్కొక్కటే—మద్రాసు ప్రెశిడెన్సీలో వున్న గుళ్లన్నీ కొద్దికాలంలోనే అస్పృశ్యుల కందుబాటయిపోవచ్చు.

కాని,

శాసనం పుట్టిన మలబారు, మారేటకాయ అయిపోయి వుండగా, ఆశాసనానికి వ్యాప్తి లేనిచోట—యెవరూ అనికోనిచోట యిది ప్రారంభం అయింది.

ప్రభుత్వం వైష్ణవస్వాముల చేతిలో వుండగా, సంస్కారం శైవక్షేత్రాలలో విరుచుకు పడింది.

ఇది గమనించతగ్గ విషయం.

అయితే,

దీనివల్ల అస్పృశ్యులకు కలిగే ప్రయోజనం యేమిటి ?

ఇది వారి కోరికా ?

వారి అభ్యుదయానికిది అగత్యమా ?

ఆకలితోటీ, అవమానాలతోటీ వుడికిపోతూ వున్న అస్పృశ్యుల యువయువతులను ఇది ఆకర్షించగలుగుతుందా ?

పోనీ,

ఆచారమూ, మూఢభక్తులా కలిగివున్న సవర్ణవృద్ధుల్లోనే దేవాలయ ప్రాముఖ్యం ప్రబలి వుండడం తెలుసా ?

ప్రపంచప్రవృత్తి గుర్తించి వాని కభిముఖంగా పోతూ వున్న సవర్ణ యువయువతులు దేవాలయాలకు వెళ్లి అర్చనలు చేసే పరిస్థితులే మయినా కనపడుతున్నా ?

అసలీ దేశంలో యికముందు విగ్రహారాధన ఆచరణలో వుంటుందా ?

అథవా,

“గుడి” అనేది పోకపోయినా యిన్ని రకాల దేవుళ్లూ, అమ్మవార్లూ నిలుస్తారా ?

సంస్కర్తలు తమ సిద్ధాంతాలను సనాతనులమీద రుద్దడం ధర్మం అయితే, మతాంతరులు హిందూమతంమీద దండెత్తడం అక్రమం అవుతుందా ?

ఎటు చూసినా అస్పృశ్యుల దేవాలయప్రవేశం శాసించేవారూ, సమ్మతించేవారూ, సమర్థించేవారూ భావదాసులనే చెప్పవలసి వస్తోంది.

అస్పృశ్యులలో, క్షుద్రదేవతారాధన తప్పించి, సత్యం బోధపరిచి, యేకేశ్వరోపాసన ప్రవేశపెట్టడానికి బదులు, సంస్కర్తలు ఇలాగ బహుదేవతారాధన ప్రవేశపెట్టడం మౌఢ్యమూ, మౌర్ఖ్యమూ తప్ప మరేమీ కాదు.

అస్పృశ్యులను సవర్ణుల పాఠశాలల్లో ప్రవేశపెట్టలేని సంస్కర్తలు— అస్పృశ్యులను ప్రత్యేక “పల్లె” లలో నుంచి గ్రామాలలోకి—సవర్ణుల మధ్యకు బదిలీ చెయ్యలేని సంస్కర్తలు—అస్పృశ్యులను సవర్ణుల జలాధారాలు వాడుకునేటట్టు చెయ్యలేని సంస్కర్తలు, వారిని దేవాలయాలలోకి తీసుకు వెళ్లడం బాధ్యత తప్పించుకోడమూ, వంచించడమూ మాత్రమే అవుతుంది.

ఇదిలా వుండగా,

ఈ దేవాలయాలు మన జాతికి అజ్ఞానం కలిగించాయి.

భగవంతుణ్ణి మరిపించాయి.

మానవత్వమే కలుషితం చేసేశాయి.

అస్పృశ్యులయినా యీ సంగతి గుర్తించి, సంస్కర్తల అజ్ఞానమున్నూ గమనించి, దేవాలయాలను బహిష్కరించకపోతే యింకా కించపడిపోతారు.

మరి బాగుపడరు.

త్రేతాగ్నులు

ఎన్ని వైపులనుంచి, ఎన్ని చోట్ల, యెన్ని విధాల, యెంత సూక్ష్మంగా పరిశీలించినా, ఇవాళ కాంగ్రెస్సువలయంలో అతి విజృంభణంగా జరుగుతూ వున్న నిర్మాణకార్యక్రమం ఆరిపోని అంతఃకలహం వొక్కటే.

సరసంగానే వుంది.

సాంఘికంగా, యుగయుగాలుగా కుళ్లి కంపెత్తిపోయి వుండిన హిందూదేశంలో కేవలమూ శుష్క-రాజకీయాల కోసం ప్రారంభమైన వొక పాక్షికసంస్థయొక్క యాభైసంవత్సరాల దీర్ఘజీవితానికి, ఇది, వుచితపరిణామమే.

కాగా, దీనికి కారకులు ముగ్గురు.

వారు గాంధీ, నెహ్రూ, బోసుగార్లు.

ఈ సంకులసమరంలో మరికొందరి పరవళ్లున్నా లేకపోలేదు.

అయితే, వారందరూ వొట్టి సత్తరకాయలే గాని పెండ్డే కాసులు కారు.

ఏదో వొక ప్రయోజనమే వారికి కావలసింది.

దానికోసం, వారు, ఎంతెంత లయినా చెయ్యగలరు, ఎందుకయినా సిద్ధపడగలరు.

వారికి నాయకత్వం అక్కర్నూ లేదూ;

అసలు, వారికా యోగ్యతా లేదూ.

పోగా, యిక కారణాలు.

గాంధిగారి కారణం, యిరవై సంవత్సరాలుగా భుక్తపడుతూ వుండిన నాయకత్వం యికముందు నిలవలేదేమో అన్న కంగారు.

నెహ్రూగారి కారణం, గాంధిగారి తరవాత నాయకత్వం తమకి తక్కదేమో అన్న అనుమానం.

బోసుగారి కారణం, చేజిక్కిన నాయకత్వం యిట్టే జారిపోయిందన్న అక్కసు.

ఇందులో యేది కాదనడానికి వీలూ?

ఎవర్ని లేదనడానికి వల్లా?

నిజానికి, ముగ్గురూ అనేకవిధాల త్యాగం చేశారు.

కాని ఆత్యాగానికి వుద్దిష్టమూ, ఫలితమూ అయిన నాయకత్వం కూడా త్యాగం చేసెయ్యాలంటే సాధ్యమా?

“ఏది దేశమో?” అంటే యిందులో దేశం అక్కర్లేదనేవారెవరూ?

అసలు, వున్న పుట్టిముసుక అంతా దీసుకుంటే?

సత్యం చాటున ఘోరమైన అసత్యం.

అహింస మాటున దారుణమైన హింస.

వైరాగ్యం వెనకాల హద్దులేని అహంకారం.

ఇవాళ కాంగ్రెస్సులో వున్న ఇవి.

ఇప్పుడు కాంగ్రెస్సులో చెలామణీ వీటికే.

వీటికి మొక్కవోని సాధనం నయవంచన.

అది పరమావధి చేరుకుంది.

కనకనే బట్టబయలు అయిపోయింది.

వాస్తవంగా, దేశీయుల శ్రేయస్సు కోరేవారికి, ఇది, ఆహ్లాదకరమైన విషయం.

అయితే, అది మొదలు అంతందాకా కృత్రిమమే అయిన సన్నివేశం యింతకాలం నిలిచివుండడం ఆశ్చర్యకరమే.

కాని, యేమిటి చెయ్యడం?

ఒక వుద్యమం విజృంభించడానికి కొంతకాలం పడుతుంది.

మళ్ళీ ఆవుద్యమమే పడిపోడానికి కొంతకాలం పడుతుంది.

అంచేతనే గాంధిగారి నాయకత్వం పూర్వపక్షం అయిపోయే రోజు రావడానికి యిరవై యేళ్ళు పట్టింది.

మనకి యిరవై యేళ్ళంటే యెంతో దీర్ఘంగా కనపడుతోంది గాని ప్రపంచప్రవృత్తిలో యిది అత్యల్పకాలం.

బిసెంటు దొరసాని హోంరూలు మాణ్టెంటురోజుల్లో యీ గాంధిగారెక్కడా?

తిలకుగారు బతికి వున్నంతకాలమూ యీ గాంధిగారిని చూసినవారెవరూ?

పోనీ, గాంధిగారికి ఈ ప్రాతికూల్యం యివాళే వచ్చిందా?

గోపాలకృష్ణయ్యగారు వారిని కొస్తా కూస్తా చీకాకుపరిచారా?

చిత్తరంజనదాసుగారు చూపించిన ప్రాతికూల్యం సామాన్యమా?

కాని దేశదౌర్భాగ్యంవల్ల ఆయిద్దరికీ అకాలమృత్యువు సంభవించింది.

మాహమ్మదీయుల దురదృష్టంవల్ల మహమ్మదాలీగారు కూడా మంచి సమయంలో చనిపోవడమే సంభవించింది.

తరవాత నారిమన్ ఖరేగార్ల వుదంతాలు ప్రాప్తించాయి; కాని వారికి చేవ చాలింది కాదు.

“నువ్వెంత?” అని యెదురుకోగలిగారే; గాని చివరికి వారు నిలవలేకపోయారు.

ఒక్కటే మాత్రం వుంది.

ఈప్రతిఘటన లన్నీ వ్యర్థంగా పోలేదు.

ఇవి ప్రాతికూల్యం అగత్యం అని దేశీయులకు తట్టేటట్టు చేశాయి.

కొంత కథ నడిపాయి.

గాంధిగారికి యెదురు పుట్టించాయి.

సరిగా, యీసమయంలో వచ్చింది బోసుగారి ప్రతిఘటన!

దీనికి దర్బార్ వీరవల్లాగారి అమోఘప్రజ్ఞ సాయపడింది.

కాని పరకాయించి చూస్తే, అసలీ గౌరవం నెహ్రూగారికి తక్కి వుండవలసింది.

“సోషలిజం, సోషలిజం” అని సింహనాదం చేస్తూ, “శుద్ధ ఖద్దరు” ను చంపి పోగులు పెడుతూ, చిచ్చరపిడుగులా రంగంలో వురికారు ఆయన.

కొనసాగోయి వుండిన యువయుపకులుకూడా ఆయనను దృఢంగానే బలపరిచారు.

అయితే, ఆవేశమే కాని ఆయనకు ఆలోచన లేకపోయింది.

ధైర్యసాహసాలే కాని ధీచాతుర్యాలు చాలకపోయాయి.

తమ తాహతేమిటో గుర్తించుకోకుండా అల్లర్లు జరిగేచోట కళ్ళు మూసుకుని ముక్కుమీద వుడికే తెంపరితనమే గాని ప్రతి ఘటన వచ్చినచోట యుక్తిప్రయుక్తులతో వాగ్వాదం చేసే శక్తి లేకపోయింది.

గాంధిగారు ఈలోపం గుర్తించారు.

ఈదౌర్బల్యమున్నూ గ్రహించారు.

మితవాదులు ఈచ్ఛదశలో వుండిన రోజుల్లో, సాహసించి విమర్శించగల నాయకులను, ప్రభుత్వంవారు వున్నతోద్యోగా లిచ్చి లోబరుచుకునేవారు.

అలాగే, వెంటనే, గాంధిగారు, నెహ్రూగారికి వరాసగా రెండుమాట్లు కాంగ్రెస్సు అధ్యక్షత ప్రసాదించారు.

"ముందు సోషలిజం కాదు" అని నెహ్రూగారిచేతనే అనిపించడానికే వారు రెండో మాటు అధ్యక్షత అనుగ్రహించారు.

ఈలోపున "నాయనా! నాతరవాత యేకైక నాయకుడవు నువ్వేనోయ్" అనిన్నీ బుజ్జగించారు.

ఇంకేం?

దీంతో నెహ్రూగారు చల్లబడిపోయారు.

సోషలిజం వెనక్కి—పోయింది.

అంటే, వారి ప్రత్యేకప్రణాళిక యెగిరిపోయింది.

పైపెచ్చు, గాంధిగారికే కాదు, వారి సన్నిహితులకున్నూ నెహ్రూగారు విధేయానుచరు లయిపోయారు.

గాంధిగారి వాగ్దానం యెందుకో, నాయకత్వం వొకరిస్తే వచ్చేదవునో కాదో గుర్తించుకోకుండా, గాంధిగారి అనంతరం తమ కెవరూ పోటీ రాకుండా వుండేటట్టు వుచ్చులు పన్నుకోవడం అనే దుర్భ్రమలోనున్నూ పడిపోయారు.

బోసుగారు కాంగ్రెస్సు సింహాసనం అధిష్ఠించిన పరిస్థితులు ఇవీ.

ఇవాళ, బోసుగారి మాటల్లో స్వవచనవిఘాతాలు చూపించేవారు దండిగానే వున్నారు.

కాని వారికి తత్వం తెలపదు.

రాజకీయాలు తెలుసుకోడానికి కూడా వారికి అర్హత లేదు.

ఏమంటే?

సుభాసుబోసుగారి ప్రణాళిక, ముందు, గాంధిగారి ప్రణాళికకు స్వస్తి చెప్పడం.

కాని, పరిగెత్తేవాణ్ణి పట్టుకోవాలంటే కూచుంటే ఆపని జరగదు.

అంచేత, ప్రారంభంలో బోసుగారు గాంధిగారి అడుగుజాడల్లో నడవ్వలసి వచ్చింది.

అయినా, అది యెంతో కాలం జరగలేదు.

బోసుగారు వచ్చినపని మరిచిపోలేదు.

కాని, యీసంగతి గాంధిగారు గ్రహించేశారు.

అది మొదలు.

కొన్నాళ్లు గుసగుసలు.

మరికొన్నాళ్లు తటపటాయింపులు.

చివరికి చూసుకోడాలూ, కోసుకోడాలూనూ.

ఇవాళ, కాంగ్రెస్సులోనే అటు రైటువర్డుబ్లాకూ, యిటు ఫార్వర్డుబ్లాకూనూ.

రెండూ సమానంగా తూగుతున్నాయి.

ఇరవైయేళ్లనుంచి సాగుతూ, అంతా ఆక్రమించుకుని వుండిన వృద్ధనాయకత్వమూ, ఇవాళే ప్రారంభమై "స్వయం రాజా స్వయం మంత్రీ, స్వయం సర్వం" గా వున్న బాలనాయకత్వమూ వొకటే రేఖమీద వున్నాయి.

అటు కాంగ్రెస్సుకి దూరంగానే వుండి కాంగ్రెస్సుమీద నియంతృత్వం చెలాయించడం.

ఇటు కాంగ్రెస్సులోనే వుండి కాంగ్రెస్సులో కల్లోలం పెంచడం.

ఇందులో యేది తప్పు, యేది వొప్పు!

ఇది కాదు ఇప్పుడు చూడవలసింది.

ఇది కాదు ఇప్పుడు ఆలోచించవలసింది.

ఇక కాంగ్రెస్సు భవిష్యత్తు యేమిటి?

దానికి ఏకనాయకత్వం పోయింది.

ఇద్దరున్నూ కాదు, ముగ్గురు నాయకు లయినారు.

ముగ్గురూ సమానులు.

బోసుగారి ప్రగమనశీలత తెలుస్తూనే వుంది.

నెహ్రూగారి బలమున్నూ కనపడుతూనే వుంది.

ఇక గాంధిగారి విషయం తెలుసుకోవాలి.

గాంధిగారి అనుగ్రహం ఆశించి, ఫార్వర్డుబ్లాకునీ, బోసుగారినీ నిరసిస్తూ వుండిన్నీ నెహ్రూగారు, మంత్రిపదవులు స్వీకరించాక కాంగ్రెస్సు పతిత మయిపోయిందని చాటుతూ వుండడం తెలుసా?

అయినా గాంధిగారు కాంగ్రెస్సు మంత్రులను కంటిని రెప్పలాగ కాపాడుకుంటూ వుండడం యెందుకో బోధపడుతోందా!

గాంధిగారి కిప్పు డున్న బలం అంతా మంత్రులు.

తద్వారా యేడు రాష్ట్రాలలో వారికి కొత్తరకం పలుకుబడి యేర్పడి వుంది.

ఇవాళ యేదో వొక కారణంవల్ల కాంగ్రెస్సు మంత్రులు బయటికి వచ్చేశా రనుకుందాం.

వెంటనే గాంధిగారు ఏకాకి అయిపోతారు.

ఇంతేనా?

రైతులు ఎదురుకుంటారు.

కార్మికులు జబ్బ చరుస్తారు.

వర్తకులు "దూరం" అంటారు.

పూజారులు చల్లచల్లగా జారుకుంటారు.

అస్పృశ్యులు అస్పృశ్యులుగా చూస్తారు.

జమీందార్లు పురెక్కుతారు.

మహారాజులు "కబడ్దార్" అంటారు.

ప్రభుత్వం ౧౪౪ సెక్షన్ బయటికి తీస్తుంది.

ఆట కడుతుంది.

ఇదంతా చూస్తే ఏమి తెలుస్తోంది?

గాంధిగారికీ నాయకత్వం కావాలి.

నెహ్రూగారికీ నాయకత్వం కావాలి.

బోసుగారికీ నాయకత్వం కావాలి.

ముగ్గురూ రుచిమరిగి వున్నారు.

ఎవరు తీసిపోతారూ?

గాంధిగారు సర్వమూ ధ్వంసం చేశారు గాని బాగుచెయ్యలేదు.

నెహ్రూగారి సామ్యవాదానికి పరాధీనదేశంలో స్థానం లేదు.

బోసుగారి అల్టిమేటం నవ్వులపాలయిపోతుంది.

కాని ముగ్గురూ మూడు అగ్నులు.

కాంగ్రెస్సు ఎండిపోయిన వొక మహారణ్యం.

దాన్లో యీమూడు అగ్నులూ విజృంభిస్తున్నాయి.

ఫలితం నిర్ధూమధామం?

అంతే కాని యీముగ్గురివల్లా దేశాని కేమీ కాదు.

ఈముగ్గురూ కాంగ్రెస్సు కృత్రిమజీవితం తుంచెయ్యడానికే వుపకరిస్తారు.

ఇప్పుడు కావలసిందే అది.

చివరికి వీరున్నూ పడిపోతారు.

దేశం వుద్ధరించగల వర్ధమానచంద్రుడు, ఆతరవాత, నింపాటిగా బయలుదేరి వస్తాడు.

బొంబాయి మద్యనిషేధం

నిన్నటిదాకా కాంగ్రెస్సు మంత్రులు కుప్పిగంతులు వేశారు.

ఇవాళే వారు బొంబాయితో పోటెంపుకి పూనుకున్నారు.

వారికి మా మొదటి ప్రశంస అందిస్తున్నాము.

అటు కాంగ్రెస్సు మహాపురుషులు పూగిపోతూ వున్న సమయంలోనే యిటు కాంగ్రెస్సుమంత్రులు ఇలాగ సాహసించడం చాలా మంచి సన్నివేశం.

ఇవాళ ప్రపంచం అంతటి దృష్టీ బొంబాయిమీద వుందట.

మరి బొంబాయి దృష్టి?

వందిమాగధులకు అంతటిదృష్టి వుండదు కదా?

మద్యం యివాళ పుట్టలేదు.

మద్యనిషేధమూ అంతే,

వెలుగునీడల్లాగ ఆదినుంచీ యివి కూడాకూడానే వస్తూవున్నాయి.

ఒకదాన్ని విడిచి వొకటి వుండడం లేదు.

ఎప్పటికీ ఇంతే.

దాస్యం ప్రారంభం అయినాక వెయ్యి సంవత్సరాలకు మనకి కొంచెం ఆర్థికస్వాతంత్ర్యం వచ్చింది.

అన్ని రకాల మనుష్యులూ పన్నుల భారంతో కుంగిపోతున్నారు.

దేశాభిమాని అయినవాడు ఇప్పుడు చెయ్యవలసిన మొదటి పని పన్నుల తగ్గింపు కాదూ?

మద్యవ్యయం ఐచ్ఛికం.

పన్నుల విధానం సార్వజనికం.

దొరతనం సరిచెయ్యవలసిం దేది?

ఇది యెవరి కేనా తెలుస్తుంది.

కాని కాంగ్రెస్సు మంత్రులు గాంధిగారిని సంతృప్తిపరచడానికే ఏర్పడ్డారు.

ప్రజలను వుద్ధరించడానికి కాదు.

ఇక యెవ రేం చెబితే మాత్రం వారికి వినపడతాయీ?

మద్యనిషేధం అసాధ్యం అని గాంధిగారు చెప్పినప్పుడే వారు వింటారు.

విరమించుకుంటారు.

గాంధిగారు అలా చెప్పడం అసంభవమూ కాదు.

రకరకాల సత్యాగ్రహం సాగించి ముచ్చట తీర్చుకున్న గాంధిగారు ఇవాళ సత్యాగ్రహం తప్పు అనడం లేదూ?

ఉపవాసాలు నేర్పి, సమ్మెలు ప్రోత్సహించి, విద్యార్థులకు తిరగబాటు బోధించిన గాంధిగారు ఇవాళ అవి అకృత్యా లనడం లేదూ?

సంస్థానాధీశులను ఎదిరించవలసిం దని వుపదేశించిన గాంధిగారు ఇవాళ వారి పాదాలు ఆశ్రయించుకుని బతక మనడం లేదూ?

వారికి మద్యనిషేధం అసంభవం అనడం మాత్రం కొనితేవాలా?

కాని వొక్క మనిషి, తన వినోదం తీర్చుకోడానికి ఇలాంటి అసంభవాలకు ఆజ్ఞలు సాయించడం అనుచితమైన పని.

ఇలాంటి నాయకత్వాన్ని అంగీకరించేవారు సంపూర్ణస్వరాజ్యానికి కాదు, సంపూర్ణ "బానిసతనానికి" మాత్రమే అర్హులు.

హిందీ ముప్పు తెచ్చిపెడుతుంది

తన పరిపాలనలో వున్న నుంగంబాకం హైస్కూలులో హిందీ ప్రవేశపెట్టడానికి మద్రాసు కార్పొరేషను తీర్మానించుకుంది.

కాంగ్రెస్సేతరు లంతా చక్కని హేతువాదంతో దీన్ని ప్రతిఘటించారు.

ఒక్క సత్యమూర్తిగారు తప్ప తక్కిన కాంగ్రెస్సువా రెవరూ మాట్లాడలేదు.

అదయినా శుకానువాదం.

కాని తీర్మానం నెగ్గింది.

మద్రాసులో, హిందూథియొలాజికల్ హైస్కూలులో నిర్బంధ హిందీశిక్షణ ప్రవేశపెట్టబడినది.

చేసేది లేక అందులో యేకొద్దిమంది విద్యార్థులో మాత్రమే హిందీ నేర్చుకుంటున్నారు.

కాని, ఆహిందీని నిరసిస్తూ ఆస్కూలు యెదటే ఆవిద్యార్థుల కంటే యెన్నో రెట్లమంది అరెస్టు అయి జెయిళ్ళలో పెట్టబడు తున్నారు.

ఏమిటి ఇదంతా ?

దీనికి అంతం అంటూ లేదూ ?

రేపు సంగంబాకం హైస్కూలు బెంచీలు కూడా పికెటింగూ, అరెస్టులూ, శిక్షలూ ప్రారంభం అవుతా యని తోస్తోంది.

కాని యింతేనా చెయ్యవలసింది ?

ఇదేనా మార్గం ?

హిందీప్రతికూలుర మాతృభాషాభిమానం ప్రశంసిస్తాం.

అయితే గాంధిగారి నాయకత్వం పడగొట్టా లని వారు స్మరించ లేకపోతున్నారు.

చిగుళ్ళు గిల్లితే లాభం లేదనీ సమూలంగా పెల్లగించా లనీ వారు గ్రహించకుండా వున్నారు.

మించిపోలేదు.

వారు ఇందుకు ఇప్పు డేనా పూనుకోడం చాలా అగత్యం.

ప్రబుద్ధాంధ్ర సరస్వతీ మందిరం

౧ సూర్యనారాయణమూర్తి కథలు

గ్రంథకర్త అత్తిలి సూర్యనారాయణమూర్తిగారు. ప్రకటనకర్తలు నవ్యాశ్రమ్ వర్క్సు. పోస్టుబాక్సు ౨౫౧ మద్రాసు. పేజీలు ౧౧౦. వెల ౦—౬—౦.

ఇది తొమ్మిది కథల సంపుటము. భాష వ్యావహారికము ; కాని నడక యింకను సరిగ కుదురలేదు. గ్రాంథికవాసన ముమ్మరముగ నే యున్నది. అందువలన కథనము కృతకముగ నున్నది. భావమును కొన్ని స్థలములలో క్లిష్టముగ నున్నది. సాధన చాల దనియే చెప్ప వలెను. అయినను యెత్తుగడ చాల చక్కగ నున్నది. నిర్వహణము దాని కనుగుణముగ నుండకుండుట మాత్రము వింత కల్గించుచున్నది. ముగింపు సైతము కొన్నిట సరసముగ లేదు. ఉపజ్ఞ యున్నది. భవిష్యత్తు ఆశాజనకముగ నున్నది. ౧ యానాది సత్తి. ౨ తెగిన బాకా లాగితే. ౩ కొత్తచూపు—ఇవి యీ సంపుటమునకు శోభస్కరములు.

కె. రా. శర్మ

౨. కృపణజీవి

గ్రంథకర్త విద్వాన్ సాలెపు వెంకటరత్నంగారు. పల్లెపాలెం ఆంధ్రీకుటీరంవారి రెండో పువ్వు, వెల తెలియదు.

ఇది ఒక చిన్న తెలుగుగీతికావ్యం. ఎత్తుకున్న విషయం చాలా ఉన్నత మైనదే "కథావస్తువు ఆధునికదరిద్రనారాయణసమస్యా పరిష్కారసూచకం" కాని డబ్బు బిచ్చ మడిగినందుకు గాను ఒక బిచ్చగాణ్ణి ఒక విద్యార్థి డొక్కలో తాపు తన్నగా వాడు చావ డమూ, అతని తండ్రి దగ్గఱ లంచము దిని మేజిస్ట్రేటు కేసు కొట్టి వేయడమూ ఇందులో కథ, "రచనాపద్ధతిలో కూడా పూర్వసాం ప్రదాయాలకి వ్యతిరేకించాను. పాత్రోచితంగా ఉండాల నే అభి ప్రాయంచేత" అని కవిగారే వ్రాసుకున్నారు. తదనుగుణంగా భిక్షుకుడిచేత గ్రామ్యం మాట్లాడించారు. కాని ఛందోబద్ధంగా పద్యాల్లో మాట్లాడే భిక్షుకుడు కవిగారికి లభించనందువల్ల కథలో ఎక్కడా రసభంగం మాత్రం కాలేదు. "సూడెంట్లు గ్రూపు" సహజంగా ఆంధ్రాంగ్లపదమిశ్రిత మైన సంకరభాషలోనే మాట్లా డారు. "టిఫెను" "సిగరెట్టుటిన్ను" "ఇడ్లీబెగ్గరు" "ఫూలు" "ఫ్యాను" "హాస్కు" "కంగ్రాచ్యులేషన్సు" మున్నగునవి ఈకావ్యాన్ని అలంకరించిన ఆంగ్లేయపదాలు. ఇందులో రచనా చమత్కారం ఉంటే ఉన్నదేమో కాని కవిత్వం తక్కువ వని నా అభిప్రాయం.

కో. వెం. సు.

సవరణ

ఉప ఫిలిము ప్రకటనలో కవి పేరు ఇటీవల కనపడినది. వరవిక్రయం వ్యాసంలో "లే" దని నే నాక్షేపించాను. నే నామాట తీసేసుకుంటున్నాను.

శ్రీ. సు. శాస్త్రి

నారాయణరావు, పుల్లయ్యగార్ల వరవిక్రయం

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

సింగరాజు లింగరాజు పరమలోభి.

మలభక్షకుల్లో మొదటి రకం.

ఈఫిలిములో కూడా యీపాత్రకే విషయంలోనే ప్రాధాన్యం.

కాగా, నాటకకర్తకు మాత్రమే తసక్తపడవలసిన దంతా, అజ్ఞాతవీరుడైన ఫిలిం కవి మీదా, ఫిలిం డైరక్టరుమీదా అమాంతంగా విరుచుకు పడిపోయింది.

ఈపరిణామం అనుకంపాజనకంగానే వున్నది; కాని యేమిటీ చెయ్యడం?

నాటకంలో పరమలోభిగా మాత్రమే వుండిపోయిన లింగరాజు, ఫిలింలోకి వచ్చాటప్పటికి, దొంగా హంతకుడూ కూడా అయిపోయినప్పు డింకెక్కడి కథ, యింకెక్కడి కవిత్వం, యింకెక్కడి రసం?

అయితే, దీన్నిబట్టి చూస్తే, ఫిలింకవికీ ఫిలిండైరక్టరుకీ కూడా, తెరమీదికి లాగాటప్పుడు నాటకం సంస్కరించాలన్న సంగతి తెలుసు నని స్పష్టమే.

కాని, అందుకు చాలినంత సంస్కారం మాత్రం లేకపోయింది.

దీనివల్ల, చికిలీ చేసిన చాకంటే తుప్పు పట్టిపోయిన కత్తే పదునుగా వుండినట్టూ, సానలు తీర్చిన దానికంటే కొవ్వురాయే మెరిసిపోతూ వుండినట్టూ, సాఫు కంటే చిత్తుప్రతే నయంగా వుండినట్టూ అయిపోయింది.

చదవ్వేస్తే వున్న మతి కాస్తా పోయినట్టున్నా తరహా రయిపోయింది.

ఏమంటే?

ఇందులో ప్రతిపాదించబడ్డ వస్తు వేమిటి?

ఇక్కడ నారాయణరావుగారి ప్రసక్తి లేదు.

పోగా, యిక యీవిషయం పుల్లయ్యగారి ఆలోచన కందలేదు.

కన్యాదాత కొంప కూల్చేటంతటి వరకట్నం పుచ్చుకునే పెద్దమనిషి పరమలోభే అయి తీరాలా?

అయితే మాత్రం, వరకట్నం నీతిమాలిం దని తోపింపచేసే ఘట్టాలు చేర్చడానికి బదులు అతని లోభాన్ని చిత్రించే ఘట్టాలతోటే కథ నిండబెట్టాలా!

అడగనక్కర్లేదు.

హిందీఫిలిములను తెనుగులోకి మార్చే ప్రజ్ఞ వేరూ, ఈవిషయాలు గుర్తించగల ప్రతిభ వేరూనూ.

ఆలాగే, డైరక్టరని పేరు రావడం వేరూ, డైరక్షనుకి సంబంధించిన సకలవిషయాలలోనూ పరిజ్ఞానం కలగడం వేరూనూ.

౧౮

ఈఫిలిం పేరు వరవిక్రయం.

ఫిలిముకి, లింగరాజు, మసిబొగ్గులు కొలిచి జాగ్రత్త చెయ్యడంతో ప్రారంభం.

ఎక్కడి కెక్కడి సంబంధమూ?

వరకట్నం విషయమై లింగరాజు చేసిన పనంతా వొక్క రంగంలోనే వుంది.

అది, యిద్దరు దళ్లారీలచేత వేలంపాట పెట్టించడమూ, పది రూపాయలు బజానా పుచ్చుకోడమూ అగ్రిమెంటు రాయడమూ—ఇంతే.

అగ్రిమెంటన్నప్పుడు వుభయపక్షాలవారూ సంతకం చెయ్యనక్కర్లేదూ?

మరి పురుషోత్తమరావు సంతకం చేశాడా?

అయితే, యిది లాయర్లకి సంబంధించిన విషయం.

నేను విడిచిపెట్టేస్తున్నాను.

మరిప్రకృతం.

మసిబొగ్గులు కొలవడం—చెక్కపేళ్లు లెక్కపెట్టడం—కాకిగూటి పుల్లలతో వంట చెయ్యమనడం—నిలువునా చీరిన అగ్గిపుల్ల కొలూకు రెండో భాగంతో నిప్పు చెయ్య మనడం—చింత పుల్లతో చారు కాచమనడం—క్షౌరం చేయించుకోకపోవడం—ఇనప్పెట్టికి నీరాజనం యిస్తూ కర్పూరం వెలిగీ వెలగడంతోటే వొకమాటు చూపించేసి వెంటనే ఆర్పేసి జాగ్రత్త చెయ్య

డం—పెళ్ళివారు చేసిన సప్లయిలు వారి మనుష్యుల చేతనే బజారుకి పంపి డబ్బు చేసుకోవడం—సంభావనకి వచ్చిన బ్రాహ్మలను తరిమి వెయ్యడానికి పోలీసులను ఏర్పాటు చేయించడం—కుసుమసీట్లూ, సోఫాలూ యింటినిండా వుండగా, నాటికి తీసిపోని శయ్యకూడా వుండవలసే వుండగా, వుండనే చెప్పవలసివుండగా, యినప్పెట్టె దగ్గిర పొక్కుడూ నులకకుక్కిమీద పడు కోడం—యీ వర్గాలవల్ల లింగరాజు లుబ్ధత్వం మాత్రమే కనపడుతోంది.

ఇవి చూసినప్పుడు నవ్వు మాత్రమే వచ్చింది.

లింగరాజుమీదగాని, అతని చేష్టలమీద ఏవ్యా భావం కలగలేదు.

ఈవిధంగా వరశుల్కం దూష్య మనే అభిప్రాయం పుట్టడానికి సన్నివేశమే యేర్పడివుండలేదు.

కథ యేమయినా అతికిందా ?

ఫిలిం చరితార్థం అయిందా ?

వరశుల్కం విషయంలోనూ, లాంఛనాల సంబంధం లోనూ, మర్యాదల సందర్భంలోనూ పెళ్ళి అయిదు రోజులూ ఆడపెళ్ళివారికి లింగరాజు పెట్టిన తిప్పలేమీ లేవే !

వియ్యాపురాలైనా లాంఛనాల దగ్గిరా, మర్యాదల సందర్భంలోనూ, పిలుపుల విషయంలోనూ పేచీలు పెట్టడం కనపడలేదే !

అలకపాన్పు యేష్యం అయిపోయిందే ?

నాగవిల్లి నిష్ఠూరాలు పుట్టనే లేదే ?

అప్పగింతలూ, ఆసమయంలో బహుమతీల కోసం పేచీలూ కూడా లేకుండానే పోయాయే ?

ఈసందర్భాలలో పురుషోత్తమరావునీ, భ్రమరాం బనీ యెన్నివిధాల అయినా—ఎంత అయినా యేడ్పించ వచ్చునే !

తనమూలంగా కమల కసి యెంతేనా పెంచవచ్చునే!

చలపతిరావుకి ఎంతేనా పని పెట్టవచ్చునే?

అతనిచేత యింకా యెన్ని పద్యాలయినా పాడిం చెయ్యవచ్చునే ?

ఇలాంటి వేవీ లేకపోవడంవల్ల, యీ ఫిలిం చూసిన వారికి వరశుల్కం అంటే హేయభావం లేశమూ కలగలేదే !

కలగవలసిన అగత్యం లేదూ !

౧౧

ఇక లింగరాజు దొంగతనం చెయ్యడమూ, హత్య చెయ్యడమూ మురికిగుంటలో పడి చచ్చిపోవడమూ— ఈవిషయాలు ఆలోచించవలసి వున్నది.

ఈమూడూ కూడా నాటకకర్త నారాయణరావు గారి కల్పనలు కావు.

ఫిలింకవీ, ఫిలిండైరక్టరూ స్వయంగా కల్పించినవి.

కమల స్టేటుమెంటుతో దావా అడ్డం తిరిగింది.

బసవరాజు దావా తీసేసుకున్నాడు.

లింగరాజు చిక్కుల్లో పడ్డాడు.

ఇది యిలా వుండగా,

కమలా బసవరాజూ అన్యోన్యప్రేమతో కాపరం చేసు కోవాలి.

ఏమిటి దారి ?

నాటకకర్తనీ, ఫిలింకవినీ, ఫిలిండైరక్టరునూ యెదు రొమ్ముమీద చెయ్యి వేసి నిలవేసిన వ్యాసఘట్టం యిదీ.

ధర్మమే.

నిలెయ్యవలసిందే.

కథ కంతకీ మూలగ్రంధి యిదే.

కాని, అప్రస్తుతం కావడంవల్ల నాటకకర్త సంగతి అలా వుండగా, ఫిలింకవికీ, ఫిలిండైరక్టరుకీ, దారి కనపడ లేదు.

పైగా, నాటకకర్త వేసిన యెత్తు నచ్చలేదు.

నిజానికి యీఘట్టం బాగా జటిలమైనదే.

కాని, కవీ, గ్రంథకర్తా అయి వున్నవాడికిది దుర్భే ద్యం కాదు.

అయితే, కవికే దుర్భేద్యం కాకపోతే, ఆకవి కింత ప్రసాదం పడేసే డైరక్టరుకా దుర్భేద్యం?

ఇదీ నేటి తెనుగు డైరక్టర్ల దిలాసా.

ఇంకెందుకూ?

లింగరాజు వెంటనే బయలుదేరాడు.

తాటాకులు వొత్తిగించుకుని దడిలోనుంచి అతిసులభంగా యింట్లో ప్రవేశించాడు.

కమలా, భ్రమరాంబా యేసినిమాకో వెళ్లారో యేమిటో యిల్లంతా అప్పగించినట్టయిపోయింది.

ఒక మూల రోగి పురుషోత్తమరావుమాత్రం దీర్ఘనిద్రతో సమానమైన గాఢనిద్రలో వున్నాడు.

అన్నీ బాగానే వున్నాయి కాని నగ లెక్కడ?

ఇలాంటి సందేహాలు అస్మదాదులకే గాని సమర్థులకూనా?

పైగా, లింగరాజుకి దివ్యదృష్టి కూడా వుందో యేమిటో, తాళమూ——చివరికి గొళ్లెమూ కూడా లేని పాత దేవదారుచెక్కల పెట్టె తెరిచాటప్పటికి గుడ్డపీలికలకింద కావలసిన నగ లన్నీ దొరికేశాయి.

పురుషోత్తమరావుకి ఫిలిముతో యిక పని లేకపోయింది.

అంచేత, అతను అలికిడి యేమీ లేకపోయినా వులిక్కిపడి మేలుకోడమూ, పీక పిసికి లింగరాజు అతన్ని చంపెయ్యడమూ తొరగా తొరగా జరిగిపోయాయి.

కృతార్థుడై నగలు పుచ్చుకుని లింగరాజు బయలుదేరాడు.

కాని, నాక్కోఆపరేట రైనందుకు, పురుషోత్తమరావు, వెంటనే దెయ్యం అయి కళ్లబడ్డాడు.

తన అకాలదుర్మరణానికి కారకుడైనందుకు తన తండ్రి యిలా చచ్చిపోడం కాళిందికి బాగా యిష్టమే.

అంచేతే, ఆమె దెయ్యం, యింత భాగోతమూ సక్రమంగా జరిగేదాకా కనిపెట్టుకుని వుండి తరవాత వెంటబడింది.

నిజానికి నగ లివతలికి వచ్చేశాక యిక లింగరాజు మాత్రం యెందుకూ?

అతను మురికిగుంటలో పడి చచ్చిపోయాడు.

మద్రాసు సెంట్రల్ స్టేషనులో బయలుదేరి నంబర్ వన్ కలకత్తా మెయిలు, పదీ యిరవయ్యో కాదు, యేకటాకీని యాభై రెండు మైళ్లు దాటి సూళూరుపేట వచ్చిగాని ఆగదు.

అలాగే యీఫిలిమున్నూ.

లింగరాజు చచ్చిపోయాక, షష్ఠీ దర్శనం, కమలా బసవరాజూ కాళింది స్టాట్యూ దగ్గిర బుగ్గా బుగ్గా ఆనించుకున్నప్పుడే.

తరవాత, పాతవాళ్లే కాని కొత్తవాళ్ల కింద లెక్కబెట్టదగిన వధూవరులతో కలిసి, లింగరాజు తయిణా వితంతువూ, పురుషోత్తమరావు కొత్త వితంతువూ పాటలు పాడుతూ, జెండాలు యెగరవేస్తూ వూరేగడం.

ఏమి కల్పనా! ఎంత ప్రౌఢిమా!

బిగుసుకు పోయిన వుచ్చులు విప్పి పారెయ్యడంలో యెంత లాఘవమూ.

ఎంత నైపుణ్యమూ?

అయితే, యేక కాలంలో రెండు హత్యలు జరిగాయే?

వాటి పర్యవసానం యేమిటి?

నగ లేమైనాయి?

ఆనగల సొంతదార్ల ఆరాటవడి యెలా వుపశమించింది?

కమలా బసవరాజూ యేషరతులమీద రాజీపడ్డారు?

కమల పట్టుదల చూస్తే, కోర్టులో ఆమె పొందిన విజయం కూడా గుర్తిస్తే, లింగరాజు చచ్చిపోయి తద్వారా బసవరాజుకి యాజమాన్యం రావడం కూడా గమనిస్తే పరట్నం అయినవేళ అయినపందలా భ్రమరాంబ కిచ్చివెయ్యవలసివుందే?

అదలా జరిగిందా?

ఇవన్నీ పరిష్కరించవలసినవి కావూ?

ఈగొడవ లన్నీ తెరమీద యెక్కించవద్దూ?

లేకపోతే వరశుల్కం సమస్య తీర్చబడ్డట్టయిందా?

డైరక్టరుకు ఈ సంగతు లేమీ తట్టినట్టు లేదు.

తట్టివుంటే వీటికి పరిహారం తోచినట్టు లేదు.

కాని ఫిలిం మాత్రం పూర్తి అయింది.

నానారసాభాసంగానూ ముగిసింది.

నిజానికి పుల్లయ్యగారు గొప్ప డైరక్టరు అయి వుండవచ్చు.

తారలను కూడా సృష్టించగల మహామహా—డైరక్టరే కావచ్చు.

కాని, పాత్రౌచిత్యం పాటించుకుంటూ, భాషా మర్యాదలు కాపాడుకుంటూ, రసలుబ్ధుడై కథను సలక్షణంగానూ చక్కగానూ నిర్వహించగల కవిమాత్రం కారు.

ఈవిషయం యీఫిలిములో ప్రతీ పరమాణుభాగం వల్లా రుజు వవుతున్నది.

ఇంతే కాదు.

కవి అంటే నిరసనభావం వున్నట్టున్నూ ద్యోతకం అవుతూవుంది.

ఇది యిలా కాక, "నేను" అని బాధ్యత వహించగల వొక కవి పాల్గొని వుంటే యీఫిలిం చాలా చక్కగా తయారై వుండేది.

ముఖ్యంగా, కోర్టు వ్యవహారం ముగిశాక కథ యింత అధ్వాన్నంగా ముగిసివుండకపోయేది.

బసవరాజు పాత్ర సరిగా చిత్రించబడలే దంటే—కమలపాత్ర అస లర్థమే కాలే దంటే—పురుషోత్తమరావుపాత్ర కూడా అభందరంగా తయా రయిం దంటే వొక విధంగా సమాధానం చెప్పుకుని వూరుకోవచ్చు.

ఏమంటే?

కథానిర్మాణంలోనూ, నిర్వహణంలోనూ డైరక్టరు గారికి ప్రావీణ్యమే కాదు, ప్రవేశం కూడా వున్నట్టు కనపడకపోవడం అలా వుండగా, యీవిషయాలలో ఆపాత్రధారులు కూడా పేరుపొందినవారు కారు.

కాని, కవిత్వమూ, నాటకకర్తృత్వమూ, నటనలో అఖండప్రావీణ్యమూ గల మిత్రులు లక్ష్మీకాంతకవి గారు ధరించి నటించిన లింగరాజు పాత్రకూడా యింత అసందర్భంగా వుండడం చాలా ఆశ్చర్యంగా వున్నది.

దీనివల్ల, డైరక్టరు, లక్ష్మీకాంతకవిగారి శక్తి సామర్థ్యాలు లేశమాత్రమూ వుపయోగించుకున్నట్టు కనపడదు.

ప్రకటనలను బట్టి చూస్తే, వారు, నారాయణరావు గారు రాసి వుంచినవి కాక, అదనంగా చేర్చవలసివచ్చిన సంభాషణలు రాయడానికీ, పాటలు కట్టడానికీ మాత్రమే నియోగించబడ్డట్టు కనపడుతుంది.

మరి ప్లాటు?

సంభాషణలు తయారు చెయ్యడానికే గాని, ప్లాటు వెయ్యడాని కక్కర్లేదూ ప్రవీణులూ?

ప్లాటూ, సంభాషణలూ భిన్నవ్యక్తులు రచిస్తే కథ కలవక దారుణాఖాతా లేర్పడతాయి.

సంభాషణలో వాడబడ్డ వొక్క శబ్దంవల్ల ప్లాటు మార్చవలసి వుంటుంది.

ప్లాటులో ఏర్పడిన ఒక్కొక్క మెలికవల్ల సంభాషణలో కొన్ని శబ్దాలే కాదు, వాక్యాలే కాదు, ధోరణే మార్చవలసి వుంటుంది.

అక్షరజ్ఞానమూ, ఉచ్చారణపాటవమూ లేని నటులను బట్టి కూడా ఉభయత్రా కొన్ని మార్పులు అవసరం అవుతాయి.

ఇలాంటి పరిస్థితుల్లో సంభాషణ రాయలేనివారు ప్లాటు వెయ్యడమూ, ప్లాటు వెయ్యడానికి అవకాశమో లేక శక్తో లేనివారు సంభాషణ రాయడమూనా?

౧౨

ఇక్కడికే గ్రంథవిస్తరం అయిపోయింది.

కనక, యిక చాలించేస్తాను.

నిజాని కింకా మరికొన్ని పాత్రల సంగతి చెప్పవలసిన అగత్యం యెక్కువగానే వుంది.

కథాసరణి కూడా యింకా పరిశీలించవలసే వుంది.

కాని, సరసుల కిది చాలు.

ప్రతిభ లేక గాని, "వొకరు చెబితే వినమా" అనే అహంభికవుండేగాని యిందులో వున్న సంగతులు గ్రహించనివారి కిదే యెక్కువ.

పైగా,

సంగీతమూ, బాక్ గ్రౌండు సంగీతమూ, వేషాలూ, సెట్టింగులూ, రంగాలంకరణమూ — యిలాంటివిన్నీ యింకా మెన్నో పరిశీలించవలసి వున్నాయి.

ఈవిషయాలలో మహానాయకులే రొంత్కావరా వున్నాయి.

కాని, వాటిని, ఇక్కడ నేను స్పృశించతలుచుకో లేదు.

కారణం—గ్రంథవిస్తరభీతి కొంతా, కార్యాంతర వ్యగ్రత కొంతా, కళాసాంకర్యం చూడలేని జుగుప్స కొంతానూ.

మొత్తానికి, దీన్ని గురించి టూకీగా చెప్పవలసి వస్తే,—

" ఇంత మంచి ఫిలిము మరి లేదు. ఇంత అర్థం లేని ఫిలిము మరి తయారు కాబోదు."

ఇది విచిత్రమైన సన్నివేశం.

కళాదృష్టి వుండడం—కాని సంస్కారం చాలక పోవడం—అనేక ఫిలిములు తీసిన అనుభవంవల్ల నేనా ఇది గుర్తుకు రాకపోవడం—ద్రష్టల స్థితి గతానుగతికంగా వుండడం—వ్యాఖ్యాతలలో రసలోలుపత కంటే తక్కువ ఆకర్షణలు అధికంగా వుండడం—ఫిలిముల సంబంధంగా ఇవాళ ఆంధ్రదేశంలో వున్న పరిస్థితులివీ.

జాతికి జాతి అంతా యిలాగ స్థాణువు అయిపోయి వుండడం శ్రేయస్కరం కాదు.

కనకనే నే నీ చిన్న విమర్శ ప్రకటించడానికి సాహసించాను.

ఇక వున్న దల్లా యేమిటంటే?

ఈఫిలిములో ప్రతిపాదించబడ్డ వస్తువు నారాయణరావుగారిది.

అదనంగా చేర్చబడ్డ సంభాషణలు రాసినవారూ, పాటలు కట్టినవారూ లక్ష్మీకాంతకవిగారు.

డైరక్టరు పుల్లయ్యగారు.

కెమెరామానూ, సౌండు ఇంజనీరూ, ఎడిటరూ, మార్దంగికుడూ, ఫిడ్లరూ, ప్లైనిస్టూ, హార్మోనిస్టూ దళారీ దగ్గర్నుంచి—బిచ్చగాడి దగ్గర్నుంచి నటులూ మొదలైనవారు ఫలానా, ఫలానా, ఫలానా.

మరి కవి?

....

ధిక్!

ఇదీ ధోరణి.

ఒక్క పుల్లయ్యగారే కాదు, తెలుగు ఫిలిం డైరక్టర్లందరూ యిదే వరస.

మాలపిల్లలో కథ "చలం" గారిది.

డైరక్టరు రామబ్రహ్మంగారు.

కవి.........?

ఉషలో డైరక్టరు జి. వి. రావుగారు.

మ్యూజికల్ డైరక్టరు ఫలానా.

నటులు ఫలానా, ఫలానా.

కవి.........?

రైతుబిడ్డలో డైరక్టరు రామబ్రహ్మంగారు.

మ్యూజికల్ డైరక్టరు ఫలానా.

నటులు ఫలానా, ఫలానా.

కవి.........?

ఎంత చూసినా—ఎన్ని చూసినా యిదే జబ్బు.

పెళ్ళి కావాలీ? పెళ్ళికొడుకు అక్కర్లేదూ?

తయారు చేసేది టాకీఫిలిమూ?

మూకీ అయినా కాదూ?

"నాటకాంతం కవిత్వం" అని ఆలంకారికులా?

టాకీ అంటే నాటకానికి పైమెట్టా?

కవి మాత్రం అక్కర్లేదూ?

చివరికి, తోలుబొమ్మ లాటగాళ్లు కూడా వాళ్ళ కవిని అనుసరిస్తారే?

"గండికోట" నాటకకర్తలు రామబ్రహ్మంగారు కూడా కవి అంటే యింత నిరసనభావమే కనపరచనా?

౧౩

"దీని కింత రాద్ధాంతసిద్ధాంతా లెందుకూ? డైరక్టరే కవిన్నీ అయి వుండకూడదూ? డైరక్టరుగానే కాని, కవిగా ప్రకటించుకోడాని కొప్పుకోననిపి. యిష్ట పడివుండకపోవచ్చు ననుకోకూడదూ?" అని ఆకాంక్ష.

బాగానే వుంది.

ఇలా అయితే చర్చ అక్కర్లేదు.

ఫిలింతయారీలో కవికి స్థానం వుందనీ, కథా సంభాషణలూ తయారుచేసే అధికారం కవిదే అనీ గుర్తు వుంటే యింక కావలసిం దేమిటి?

కవి నిర్ధారణ చేసి యిచ్చిన కథ రక్తి కట్టడానికి తగిన హంగులు సమకూర్చుకోవడమే డైరక్టరు పని అనీ, పామరులను రంజింపచెయ్యడంకోసం వెనకా ముందూ చూడకుండా—అసలు తెలవకుండా కథను వికటంగా సవరించడానికి డైరక్టరు పూనుకోకూడ దనీ తెలిసివుంటే యింక అభ్యంతర మేమిటి?

అయితే, డైరక్టరే కవిన్నీ అయి వుంటే యింక సంభాషణలు రాయడానికి మరొక రెందుకూ?

రచన చేతకాని—భాషే రాని కవి అయి వుంటాడా ఆ డైరక్టరు?

ఏకాంతా!

ఫిలింనిర్మాణంలో వొక కవి సలహా కూడా పుచ్చుకుని ఆ కవి కెవరో లోకానికి చెబితే యేం పోయింది?

ఫిలిములో, అనవసరమూ నిరర్థకమూ వినాశకమూ అయిన సంగీతం ప్రవేశపెట్టి, ఆ సంగీతానికి వొక డైరక్టరంటూ యేర్పరిచి, ఆ మ్యూజికల్ డైరక్టరుకి ఎక్కడ లేని ప్రకటనా చేసే డైరక్టరు, ఫిలిముకి—టాకీ ఫిలిముకి ప్రధానమైన అయిన భాషా కవిత్వమూ కవీ అంటే యింత చిన్నచూపు చూడ్డంలో వివేకం యేమి వున్నదీ?

డైరక్టరు ప్రతిభ అసాధారణమే కావచ్చు.

కాని, కవి ప్రతిభ వేరు.

కేవలం డైరక్టరు వేసిన ప్లాటులో పూర్వాపరసందర్భాలే కాదు, జిగే వుండదు.

దీనికి వరవిక్రయం ఫిలిమే మంచి నిదర్శనం.

కీర్తి కయినా అపకీర్తి కయినా యీ ఫిలింతాలూకు బాధ్యతలో కవికి గూడా భాగం వుండి వుంటే, బసవరాజు దావా తీసేసుకున్న తరవాత ఫిలిం మార్గం మరో విధంగా వుండి వుండును.

డైరక్టరు పుల్లయ్యగారికి వొక్క సూచన చేసి యిది వివరంగా బోధిస్తాను.

తాకట్టువస్తువుల సొంతదార్లు కొందరు వచ్చి తమ వస్తువు లిమ్మనీ, లేకపోతే తీవ్రమైన చర్య జరుపుతామనీ బెదిరించి వున్నారు.

కల్పన చెయ్యగలిగేవారి కిది యెంతో చక్కని ప్రాతిపదిక.

వారిలో కొందరు లాయరునోటీసు లిస్తే?

కొందరు, తాము ఇవ్వవలసిన సొమ్ము కోర్టులో పోసేసి తమ వస్తువు లిప్పించమని పిటీషన్లు పెడితే!

కొందరు ఛార్జిలే తగిలిస్తే?

వీటిమీద లీగల్ అడ్వైసు లాభం లేదన్నట్టే వస్తే?

ఎదురుతిరిగి వున్న బసవరాజు ఇల్లు విడిచిపెట్టేస్తే?

పైగా అతను ప్రతిపక్షుల్లో చేరినట్టు అనుమానం కూడా పడితే?

సుభద్ర, ప్రతీక్షణమూ కురుపు సలిపినట్టు రాసి రంపాని పెడుతూ వుంటే!

పేరయ్య కూడా నంగినంగి మాటలు చెబుతూ కాలి కింది మట్టి తవ్వేస్తూ వుంటే?

తనని, తాకట్టు వస్తువులిచ్చి మోసంచేసినందుకు ఛార్జి యిచ్చే ప్రయత్నంలో వుండి కమల లాయరు నోటీసిస్తే?

వాయిదా లింకా చాలా దూరంగా వున్న తాకట్టుదార్లను, రెచ్చగొట్టి, చంపతిరావు "మా వస్తువులు కూడా హరీ చేశావా యేమిటి బాబూ? ఏవీ, వొక్కమాటు చూపించూ" అంటూ మొయ్యబట్టిస్తే?

బసవరాజు స్నేహితులు గాకుండా పట్టుకుంటే?

పురుషోత్తమరావుగారికి వగచే పెద్దమనుష్యులు ఈసడింపులు మొదలుపెడితే?

వంటబ్రాహ్మడు సూటిపోటిమాటలకు అందుకుంటే?

తనకిస్తానన్న పది రూపాయలూ యెగబెట్టినందుకు, ఘంటయ్య, యిదే సందని రకరకాల నీలాపనిందలు వ్యాపింపచేస్తే?

విశ్వాసపాత్రులైన స్నేహితులు వస్తూ, పెత్తనం వదులుకోమనీ, లేకపోతే సగం వాటా యిచ్చి బసవరాజుని వేరుపెట్టెయ్యమనీ సలహాలిస్తే?

ఇలాగ, ఎటు చూసినా లింగరాజుకి చీమలూ జెర్రెలూ పాకినట్టు చిరాకు పుట్టిస్తే?

బేరం పెంచడంలోనూ, డబ్బు లాగడంలోనూ, లింగరాజు పురుషోత్తమరావుని పెట్టిన బాధలు చూసి వున్న ద్రష్టలు ఈసన్నివేశాలు చూసి సంతోషించరూ?

కథ రక్తి కట్టదూ?

ఫిలిం చరితార్థం కాదూ?

దీనికంటే దొంగతనమూ, హత్యా, విపత్తు పాలు కావడమూ రసవంతంగా వున్నాయూ?

ఇలాంటివింకా యెన్ని మార్గాలు చూపించడూ కవిని ఆశ్రయిస్తేనూ?

కాని, ఇవాళ, తారామండలంలో విహరిస్తున్న తెనుగుఫిలిండైరక్టర్లు "కవి" అంటే సద్భావం కనపరిచే పరిస్థితులు కనపడవు.

ఈస్థితిలో తెనుగు ఫిలిములకు డబ్బంటే రావచ్చు గాని గౌరవం యెలా వస్తుంది?

మంచి ఫిలిము కావాలంటే మాత్రం యెక్కణ్ణుంచి వూడిపడుతుంది?

సింహళ హిందూదేశాల సంబంధం

వింజమూరి సుబ్రహ్మణ్యం బి. ఏ. బి. ఎల్

ఈమధ్య సింహళద్వీపప్రభుత్వంవారు మన హిందూదేశంమీద తీవ్రమైన స్పర్థ వహించడం అందరికీ తెలుసు. ఈసందర్భంలో కాంగ్రెస్సుపక్షం పెద్దలు, యిదేదో సద్దుబాటు చేసి రమ్మని నెహ్రూగారిని ఆజ్ఞాపించడమూ, వారు, మన ప్రధానమంత్రిగారు చెప్పినట్టు అంజనేయుడు లాగ గాలిలో యెగిరివెళ్లి వ్యర్థంగా అలాగే తిరిగి వచ్చెయ్యడమున్నూ కూడా అందరికీ తెలుసు.

సింహళీయులు చెయ్యబూనిన దేమిటంటే?

ఒకటి—తమ దొరతనం వివిధశాఖల్లో పని చేస్తూ వున్న వెయ్యిమంది హిందూకూలీలను జూలై ఆఖరులోగా హిందూదేశానికి పంపివెయ్యడం.

రెండు—ఈ సంవత్సరాంతంలోపుగా మరో యెనిమిదివేలమందిని కూడా పంపివెయ్యడం.

తమ ఆజ్ఞలను మన్నించి యీ యెనిమిదివేలమందీ వెళ్లిపోటానికి స్వయాన యిష్టపడి సిద్ధపడితే వారు, ప్రతివాడికీ రెండేసిమాసాల జీతమూ ఖర్చులూ యిస్తారు. లేకపోతే, తమ కేక్షణంలో తోస్తే ఆక్షణంలో దమ్మిడీ అయినా యివ్వకుండా బలవంతాన పంపివేస్తారు.

దీనికి సింహళీయులు చెప్పుతూ వున్న కారణం, హిందువులు తండోపతండాలుగా తమ దేశానికి వచ్చివుండడంవల్ల తమ దేశీయులకు కూడు పడిపోతూ వుందనీ, హిందువులను పంపివేస్తే గాని తమ దేశీయులకు నిరుద్యోగబాధ పోదనిన్నీ; కాని యిదే నిజమైన కారణం అని చెప్పడానికి వీలులేదు.

మన దేశీయులమీద అకారణద్వేషం పుట్టడమే దీనికి ముఖ్యకారణం. ఎవరేం చేసినా మన దేశీయులు ప్రతీకారం చెయ్యలేనివారు కావడమే వారి యీ దిలాసాకి హేతువు.

ఇటు బర్మీయులూ, అటు మలయావారూ, అందరికంటే హెచ్చుగా దక్షిణాఫ్రికావారూ మరికొందరూ నానాయిబ్బందులూ పెడుతూ వుంటే మన మేమి చెయ్యగలుగుతున్నామూ?

ఇది వారికి కావలసినంత ధైర్యసాహసాలు కలిగిస్తూ వుంది.

దేశాంతరాలలోనూ, ద్వీపాంతరాలలోనూ మనవాళ్లనుభవిస్తూ వున్న అగచాట్లను తొలగించడానికి మన దొరతనం యింతవరకూ తగిన శ్రద్ధ వహించలేదు; కాని సింహళీయుల విషయమై మాత్రం కొంచెం ప్రతీకారం చెయ్యడానికి పూనుకున్నట్టు కనబడుతుంది.

అది ఆషామాషీగా తేలిపోకుండా వుండేటట్టూ, పూర్తియైన ప్రతీకారం చేసేటట్టూ మనం మన దొరతనంవారిని ప్రోత్సాహపరచాలి.